క్లుప్తంగా

బావికి కంచె ఏర్పాటు



కంచె ఏర్పాటు చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: అలేడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట చేదబావి కంచె లేకుండా ప్రమాదకరంగా ఉండడంతో గురువారం సాక్షిలో పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికతో కథనం ప్రచురింతం అయ్యింది. దీనికి స్పం దించిన అధికారులు ఇనుప జాలీతో కూడిన కంచెను ఏర్పాటు చేయించారు. దీంతో చిన్నా రుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం



లావణ్యకు ఆర్థిక సాయం అందిస్తున్న విలేకరులు

ధారూరు: కొండాపూర్‌కలాన్ గ్రామానికి చెందిన పాత్రికేయుడు చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు గురువారం సేకరించిన మొత్తం రూ.92,500 మృతుడి భార్య లావణ్యకు అందజేశారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, జిల్లా వాలిబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మున్నూరుసోమారం కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి రూ.10వేల చొప్పున, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బాచుపల్లి సీఐ ఉపేందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి రూ.5వేలు చొప్పున, ఇతరులు రూ.47,500 అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కుమ్మరి నర్సయ్య, బాల్‌రాజ్, మల్లికార్జున్, శ్రీశైలం, అశోక్, క్రిష్ణలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. నారాయణరెడ్డి, బాబాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక



రేగడిమైలారంలో నృత్యం చేస్తున్న మహిళలు

బొంరాస్‌పేట: మొహర్రం సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పండుగ సందడి మొదలైంది. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో వారం రోజుల క్రితం ప్రతిష్టించిన పీర్లకు ప్రార్థనలు చేస్తున్నారు. తుంకిమెట్ల, బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి, బురాన్‌పూర్, కొత్తూరు, రేగడిమైలారం తదితర గ్రామాల్లో రోజంతా పనుల్లో నిమగ్నమైన గ్రామీణులు సాయంత్రం మసీదుల వద్ద, ఆయా కాలనీల్లోని పీర్లవద్ద నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్నారు. ముస్లింలు ప్రత్యేక పూజలు చేసి మలీజ ముద్దలు పంచుతున్నారు.


మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



షాద్‌నగర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా రూ.39.72కోట్లతో వార్డుల వారీగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, బీటీరోడ్డు పనులతో పాటు విద్యుదీకరణలో భాగంగా పాత స్తంభాల తొలగింపు కొత్తవి ఏర్పాటు, లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ నుంచి వార్డుల వారీగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, ఇబ్రహీం, ముబారక్, విజయ్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హస్నా'బాధల్'!

- రెండు మండలాల పరిధిలో ఒకే గ్రామం
- దుద్యాల్‌లో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు
- ఎంపీడీవో, విద్యాశాఖల నిర్వహణ కొడంగల్‌లో
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- అన్ని సేవలు ఒకేచోట కొనసాగించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



హస్నాబాద్ గ్రామం ముఖచిత్రం

దుద్యాల్: గ్రామం ఒక్కటే..ఆ గ్రామం మాత్రం రెండు మండలాలుగా కొనసాగుతుంది. అది వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హస్నాబాద్. ఇది గతంలో కొడంగల్‌లో కొనసాగిన మేజర్ గ్రామ పంచాయతీ. రెండు సంవత్సరాల క్రితం బొంరాస్‌పేట్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ దుద్యాల్‌ను మండలంగా ఏర్పాటు చేశారు. దీంతో హస్నాబాద్‌ను రెండుగా విభజన చేశారు. గ్రామం రెండు ముక్కలయ్యింది. అప్పటి నుంచి కొన్ని సేవలు దుద్యాల్‌లో..మరి కొన్ని కొడంగల్ మండలంలో నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ, మండల పరిషత్ శాఖకు సంబంధించిన సేవలన్నీ కొడంగల్‌లో సాగుతున్నాయి. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు మాత్రం దుద్యాల్‌లో నిర్వహిస్తున్నారు. ఇలా కొన్ని అవసరాలకు ఒక మండలం పేరిట, మరి కొన్నింటికి ఇంకో మండలం పేరును రాయడం జరుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్క గ్రామానికి చెందిన పనుల కోసం రెండు గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అన్ని సేవలు ఒకే చోట కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

అనుకూలంగా దుద్యాల్

నూతనంగా ఏర్పడిన మండలం దుద్యాల్. ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన రెవెన్యూ, వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలు ఇక్కడ చేపడుతున్నారు. రాష్ట్రంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న మండలంగా పేరు. ఈ మండలంలో త్వరలో పరిశ్రమలు నెలకొల్పనున్నారు. రోడ్లు, ఆయా కార్యాలయాల నిర్మాణాలతో మౌలిక సౌకర్యాలు వేగంగా ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 1,275 ఎకరాల్లో ప్రభుత్వం పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయనుంది. ఒకే మండలమైతే పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. యువతకు మెరుగైన జీవనం లభించే అవకాశం ఉంటుంది. ఈ కోవలోనే హస్నాబాద్ గ్రామాన్ని దుద్యాల్ మండలంలోనే కొనసాగించాలనేది మెజార్టీ ప్రజల అభిప్రాయం.

రాజకీయంగా పరిశీలిస్తే..

యువ నాయకులు రాజకీయంగా ఎదగాలంటే దుద్యాల్‌లోనే సాధ్యమనే భావన వ్యక్తమవుతుంది. ఎందుకంటే మండల కేంద్రం కంటే హస్నాబాద్ గ్రామ విస్తీర్ణం, జనాభా, చదువుకున్న యువత, ఉద్యోగస్తులు ఇలా కష్టపడి పనిచేసే వారి సంఖ్య ఇక్కడ ఎక్కువగానే ఉంది. దీంతో పాటు మండలంలో రాజకీయంగా ఉన్నత పదవుల్లో స్థిరపడ్డ వారు, రాజకీయంగా ఎదిగేందుకు చక్రం తిప్పే నాయకుల సంఖ్య కూడా ఎక్కువే. అన్ని విధాలుగా ఇక్కడ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఇబ్బందుల్లో విద్యార్థులు

రెండు మండలాల అనుసంధానంతో విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పదోతరగతి పాసైన విద్యార్థికి పాఠశాలలు ఇచ్చే టీసీలో హస్నాబాద్ గ్రామంగా ఉంటుంది. అదే విద్యార్థి కులం, ఆదాయ ధ్రువ పత్రాల దరఖాస్తు ద్వారా తీసుకుంటే దుద్యాల్ మండలం అని ఉంటుంది. వారు ఏదైన కళాశాలలో చేరినప్పుడు సంబంధిత కళాశాల అధికారులు ప్రశ్నిస్తున్నారు. వారికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు.

గ్రామ జనాభా..

2011 జనాభా లెక్కల ప్రకారం..4,844 మంది ఉన్నారు. ఇందులో 2,504 పురుషులు, 2,340 మంది మహిళలు కలరు. ప్రస్తుతం 6వేల నుంచి 7వేలకు పెరిగే అవకాశం ఉంది. ఓటు హక్కు కలిగిన వారు దాదాపు 4,500 మంది వరకు ఉంటారని గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు.

ఒకే మండలముగా ప్రకటించాలి



రెండు మండలాలతో సంబంధం ఉండడం వల్ల ఆయా పనులు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. రెవెన్యూ పనులకు దుద్యాల్, ఎంపీడీవో కార్యాలయ సంబంధిత పనులకు కొడంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఒకే మండలంగా అంటే అన్నింటికి ఒకేచోట సేవలు లభిస్తాయి. కాబట్టి దుద్యాల్ లేదా కొడంగల్‌లో దేన్నైనా ఒకదాన్ని మండలంగా ప్రకటించాలి.

– చెట్టుకింది ఈరప్ప, గ్రామస్తుడు

సీఎం సహాయనిధి పేదల పెన్నిధి



చెక్కు పంపిణీ చేస్తున్న రవి నాయక్

- ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్
- బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

దుద్యాల్: సీఎం సహాయనిధి పేదల పెన్నిధి అని ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ పేర్కొన్నారు. గురువారం ఈర్లపల్లి గ్రామంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంత్రకుంట తండాకు చెందిన రాధాబాయికి రూ.50వేలు, రాథోడ్ సురేశ్‌కు రూ.29వేలు సీఎం సహాయనిధినుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇంట్లో పెద్ద కొడుకులా మెరుగైన చికిత్స కోసం, కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు లబ్ధిదారులకు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్ల మొగులప్ప, రాహుల్ నాయక్, సోనిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

మండల విద్యాధికారి గోపాల్



మహాత్మ జ్యోతిబాపూలే బాలికలపాఠశాలలో విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యులు

పరిగి: విద్యార్థినులకు ఉచిత దంతవైద్య సేవలు అందజేయడం అభినందనీయమని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో గురువారం పెన్నర్ ఇండియా లిమిటెడ్ వారి సహకారంతో శ్రీసాయి డెంటల్ సర్జరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు విద్యార్థులకు వైద్య సహాయం అందజేస్తూ, ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులే ఎక్కువగా గురుకులాల్లో విద్యనభ్యసిస్తుంటారన్నారు. ముున్ముందు కూడా ఇలాంటి సేవలు కొనసాగించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయండి

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్



మాట్లాడుతున్న భీంభరత్

షాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న సమ్మేళన సభను విజయవంతం చేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే గ్రామస్థాయి, డివిజన్ అధ్యక్షుల సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న నిర్వహించనున్న గ్రామ పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారన్నారు. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభను నిర్వహిస్తున్నారని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు గౌరి సతీష్, ఎన్.రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోతుగల్ గ్రామానికి చెందిన అజీమ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి భీంభరత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కుల్కచర్ల ఎస్‌బీఐ మేనేజర్‌గా గోపాల్ సింగ్



కుల్కచర్ల: ఎస్‌బీఐ మండల నూతన మేనేజర్‌గా గోపాల్ సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వినోద్ వనస్థలిపురానికి బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహించిన గోపాల్ సింగ్ కుల్కచర్లకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ సింగ్ మాట్లాడుతూ ఖాతాదారులకు అన్నివిధాలుగా సహాయ, సహకారం అందిస్తానన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు ప్రారంభించాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేత

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులను ప్రారంభించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పై రెండు వృత్తి కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ఆ కోర్సులను కొనసాగించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమాఖ్య ప్రతినిధులు శిరీష, స్వాతి, యంపీఎఫ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల అందజేత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్నచిల్కమర్రి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు పల్లె నర్సింహారెడ్డి, యాదయ్య టై, బెల్టులను అందజేశారు.

చారిత్రక అంశాలపై అవగాహన అవసరం



ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కు శివాజీ చిత్రపటాన్ని అందిస్తున్న అంజనేయులు తదితరులు

బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు

కుల్కచర్ల: విద్యార్థులు చిన్నతనం నుంచే చారిత్రక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొండ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు శివాజీ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చరిత్రలో ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తుల జీవితాల గురించి విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గత చరిత్ర తెలియక, పాశ్చత్య సంస్కృతి పట్ల విద్యార్థులు ఆకర్శితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా చరిత్ర తెలుసుకోవలసిన అవసరం ఉందని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, స్థానిక నాయకులు పర్వతపురం వెంకటయ్య, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పాలకమండలి సభ్యులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న తొలిఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడుతామన్నారు. సత్యనారాయణ వ్రతం, స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఎర్రగడ్డపల్లి గోపాల్, నర్సింహులు, సురేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మొయినాబాద్: నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక కార్మికులు, రైతులపై దాడులు పెరిగాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను పెట్టుబడిదారి వర్గాలకు కొమ్ముకాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెప్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యల పరిష్కారానికి అన్ని కార్మిక సంఘాలు ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని.. కార్మికులంతా సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మక్బుల్, సీపీఐ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, పాండు, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పూడూరు: దేవనోనిగూడలో ప్రొసీడింగ్ అందజేస్తున్న అధికారులు

- డీసీసీ కార్యదర్శి షకిల్
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత

పూడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని డీసీసీ కార్యదర్శి షకిల్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి, దేవనోనిగూడ, మన్నెగూడ గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా ఇళ్లు రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో పేదలకు ఇళ్లు మంజూరవుతున్నాయన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగయ్య, మాణిక్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, సొసైటీ డైరెక్టర్ చెన్నయ్యగౌడ్, నాయకులు రవి, అమర్‌నాథ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు..

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు పాత కొడంగల్ తండాలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి అధికారులు ముగ్గు వేశారు. అనంతరం ఇళ్ల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్, వార్డు అధికారి ప్రవీణ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

దోమ: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. హుస్సేన్ నాయక్ తండాలో లబ్ధిదారుడికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీకాంత్, నాగవర్ధన్, సురేశ్, నర్సప్ప, విజయ్, యాదయ్య, రాజశేఖర్, రాహుల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: ముగ్గు వేయించిన అనంతరం ప్రొసీడింగ్ అందిస్తున్న అధికారులు



దోమ: హుస్సేన్‌నాయక్ తండాలో ఇంటి నిర్మాణాన్ని, ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన

మండల విద్యాధికారి సాయిరెడ్డి



పూడూరులో వంట పాత్రలను అందజేస్తున్న ఎంఈఓ సాయిరెడ్డి

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన చేపడుతున్నారని మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం పెంచుతున్నామన్నారు. విద్యార్థులకు మెనుప్రకారం భోజనం వడ్డించేవిధంగా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు మధు, ఖాజామోహినొద్దీన్, నర్సింహారెడ్డి, నవీన్‌రెడ్డి, భీమయ్య, కార్యాలయ సిబ్బంది రాఘవేందర్, గాలయ్య, మోహన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను దాతలు ఆదుకోవాలని, బోధనాభ్యసన సామగ్రిని ఉచితంగా అందజేయడం ఎంతో అభినందనీయమని విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్, బలభీమా న్యూస్ చానల్, మా సంస్థ ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు సహాయ, సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, నందిని, మాజీ సర్పంచ్ సాయిలు, నాయకులు సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.